## 29. "సారంగ" రాగం

**పోర్టికోకి** యాభై గజాలు అవతలగా పచ్చికమైదానం లాంటిచోట చెరో కుర్చీలోను కూర్చుని ఉన్నారు భార్యాభర్తలిద్దరూనూ. ఇంకో రెండు కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. మొత్తం నాలుగు కుర్చీలూ పేకాట ఆడే వాళ్లకోసం వేసినట్టు సమలంబ చతుర్భుజం తాలూకు నాలుగు శీర్షాల్లా వేసున్నాయి. మధ్యని రెండడుగుల ఎత్తుది ఓ గుండ్రపాటి మేజా. అతనికి ఎడం పక్కగా ఒక చిన్న ముక్కాలి పీట; దాని మీద టెలిఫోను.

కారు డ్రయివరు నన్ను పోర్టికోలో వదిలెయ్యడానికన్నట్టుగా అక్కడ కొంచెం సేపు కారు ఆపికూడా; ఏదో సందేహం ఒచ్చిన వాడిలాగా యజమాని వేపు చూసేడు. అక్కణ్ణించి ఒక సంజ్ఞ. వెంటనే కారు ముందుకెళ్లింది; వాళ్లు కూర్చున్న చోటికి చాలా దగ్గిరగా ఆగింది.

నా అంతట నేనుగా కారు డోరు తెరుచుకుని కార్లోంచి దిగిపోతే ఏదో ప్రమాదం అన్నంత మెరుపువేగంతో; డ్రయివరు, తను దిగి, నేనున్న దగ్గిర డోరు తెరిచి, వొంగి నిల్చున్నాడు. నేను ఒళ్లు వొంచి కార్లోంచి దిగి నిటారుగా నిలబడే సమయానికల్లా సారంగ చేతులు జోడించుకుని నా ఎదురుగా ఉన్నాడు.

ఆ ఎదురు సన్నాహం ఒక హస్త విన్యాసంలోకి మారి, నేను నా ప్రమేయం లేకుండానే ఆ కుర్చీల దగ్గిరికి చేరే వరకు కొనసాగింది. అప్పటికి ఆ అమ్మాయి ప్రసన్నమైన ముఖంతో, నమస్కారంతో, స్వాగతంలా నిలిచి వుంది.

"సుఖీభవ!" అని, అభయ ముద్రపెట్టి, వాళ్లిద్దరికీ కూర్చోమన్న సంజ్ఞచేసి, నేను సారంగకి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను.

"సీ, లలితా; దిసీజ్ ద అన్‌ఫార్చునేట్ ఆచార్యదేవ్ ఆఫ్ మిసెల్ఫ్! (చెప్పేనుగా, లలితా; ఈయనే దురదృష్టవంతుడైన మా ఆచార్యదేవుడు!)" అన్నాడు సారంగ ఆమెతో.

"డోంట్ బి సిల్లీ!" (మరీ చెప్తారు!) అందామె నవ్వుతూ.

"ఉపాధ్యాయ వృత్తి చేసినవారు ఎన్నడూ దురదృష్టవంతులు కారు. ఎందుకంటే, దేశంలో ఏమూలకి వెళ్లినా- నమస్కారం మేష్టారూ- అని పలకరించే శిష్యులు ఉంటారు."అన్నాను.

"సారీ, మేష్టారూ, లలితకి అంతపాటి తెలుగు తెలీదు. ఈమె స్వస్థలం కేరళాలో ఉన్న పాల్ఘాట్." అన్నడు సారంగ, మళ్లీ ఇంగ్లీషులోనే.

✣ ✣ ✣

పందిరి సారంగ దేవుడు - అదీ, అతని పేరు.

నేను ఇంగ్లీషు బోధిస్తూ వుండే హైస్కూలు యాజమాన్యానికి ఇంటర్మీడియట్ క్లాసులు

పెట్టుకోడానికి అనుమతి వొచ్చిన ఏడాది 'ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్'లో ఆ కాలేజీలో చేరేడు. నేను ఎమ్.ఏ., బి.ఈడీ- ని అయి వుండడంవల్ల ఇంటర్మీడియెట్ క్లాసులో కొన్ని గంటలు చెప్పమని యాజమాన్యం నాకు పురమాయించడంవల్ల సారంగ నా విద్యార్థి అయ్యేడు. ఆ తరవాత రెండేళ్లకి ఆ కాలేజికి డిగ్రీ క్లాసులు పెట్టుకొనే అనుమతి కూడా రాడంవల్ల సారంగ నాలుగేళ్లపాటు నాపాఠాలు విన్నాడు. 1958లో అతను బి.ఏ. పూర్తిచేసి వెళ్లిపోయాడు. మళ్లీ ఇరవై ఏళ్లకి ఇదే అతన్ని నేను చూడడం.

నలభై రోజులకిందట "జిల్లా కలెక్టర్‌గా శ్రీ పి.డి.సారంగ పదవీ స్వీకారం" అనే వార్త చదివినప్పుడు 'పి.డి.సారంగ' అంటే పందిరి సారంగదేవుడే అయివుండవచ్చునని నాకు తట్టింది. మరుక్షణం"ఎవరయితేనేం" అని కూడా అనిపించింది.

నెలరోజుల కిందట ఓ సాయంకాలం, ఆరున్నర అవుతూవుండగా-

రీడింగ్ రూంలో సుబ్బరామయ్యతో చదరంగం ఆడి ఇంటికి చేరేసరికి-

ఒక నడివయస్సు మనిషి మా ఇంటికి కొంచెం అవతలగా నిలబెట్టి వున్న స్కూటర్ మీద కూర్చుని దాన్ని గిర్ర్ మనిపించి అలా అటే వెళ్లడం కనిపించింది.

అతడు మా ఇంట్లోంచే ఇవతలికి వచ్చి స్కూటర్ ఎక్కి వెళ్లి వుంటాడన్న సంగతి ఇంట్లో ప్రవేశించిన తరవాత గానీ తట్టలేదు నాకు.

"ఎవరండీ, అతను?" అని అడిగింది నా భార్య.

"ఎవరు, నే చూళ్లేదే!?" అన్నాను.

"అయ్యో, మీకు తెలిసిన వాడే అనుకున్నానే..."

"ఏమైందసలు?"

"ఐదు నిమిషాలైందొచ్చి. అమ్మా, బావున్నారా- అన్నాడు. మేష్టారు కులాసేనా - అన్నాడు. అబ్బాయి గారిప్పుడెక్కడున్నారన్నాడు. ఈ అమ్మాయి మీ కుమార్తే కదా - అన్నాడు. మంచినీళ్లడిగి తాగేడు. ఈ ఇంటికి అద్దెంత ఇస్తున్నారన్నాడు. లోగడ రాజాపురంలో ఉండేవారు కదా; ఇప్పుడిక్కడ స్థిరపడ్డారన్న మాటా, అన్నాడు. అల్లుడు గారికి ఏదైనా ఉద్యోగం చూస్తున్నారా అన్నాడు. పాపం, మేష్టారికి ఈ వయస్సులో కూడా ఇంకా బాధ్యతలుండిపోయాయే- అన్నాడు. నేనేమో; అతగాడు ఎప్పుడో మీ దగ్గిర చదువుకున్నాడు కాబోసని-"

'కష్టసుఖాలన్నీ చెప్పుకునుంటావు; అంతేకదా. అంతకన్నా ఏం పట్టుకు పోగలరు, ఎవరైనా?'

పదిహేను రోజులకిందట ఓ సాయంకాలం దీపాలు పెట్టినవేళ-

రాక్సీ షాపింగ్ సెంటర్ దగ్గిర-

మా అన్నయ్య వియ్యంకుడు శివన్నగారు నన్ను ఆపి ఏదో కుటుంబ సంబంధమైన చీదర సంగతి మాట్లాడుతూ వుండగా-

ఒక డవాలా బంట్రోతు వచ్చి నాకు నమస్కారం చేసేడు. జేబులోంచి ఒక చిన్న నోట్ బుక్కు తీసి దాంట్లో వొక ఖాళీపేజి వెతికి పట్టుకుని; ఇంకో జేబులోంచి ఒక పెన్సిల్ తీసి రెండూ నా కందించేడు. "ఇంది మీద తమరెడ్రెస్ రాయుండయ్యగారూ." అన్నాడు. రాయకపోతే ఏదో ప్రమాదం అనిపించినట్టు నా ప్రయత్నం అట్టే లేకుండానే కొన్ని అంకెలూ అక్షరాలూ నా చేతిలోంచి

ఆ బుక్కులోకి రాలిపోతున్నాయి. "అసలెవర్ నువ్వు? ఆయనెడ్రస్ నీకెందుకు?" అని శివన్నగారు అడిగినట్టుంది. ఆ 'డఫేదార్' నేను రాసేదంతా అయిపోయేదాకా వూరుకుని, పుస్తకమూ పెన్సిలూ అందుకుని; 'కలట్రుగారు,'అని ఒక్క మాట మాత్రం పలికి; పరుగెత్తాడు. సరిగ్గా అప్పుడే షాపులోంచి ఒక భద్ర మహిళ ఇవతలి కొచ్చింది. ఆమె వెంట ఒక "చిన్న ఉద్యోగి" లాంటి అబ్బాయి. ఆ వెనక షాపు కుర్రాడు ఒక పెద్ద పేకెట్ భయ భక్తులతో మోసుకొస్తూ. ఆవిడ కారు వెనకసీట్లో కూర్చోగానే డఫేదారు ఆవేపున్న కారుతలుపు మూసి, తను డ్రైవర్ పక్కసీట్లోకి చేరేడు. వెళిపోతున్న కారుకి నమస్కారం పెట్టేడు, చిన్న ఉద్యోగి.

✣ ✣ ✣

అయితే మేష్టారూ; ఇల్లు కట్టుకోనేలేదన్నమాట?" అన్నాడు సారంగ, పావుగంట తరవాత.

ఆ పావుగంట లోనూ తన(ఉద్యోగ) చరిత్ర అంతా చెప్పేడు. 1959లో ఐ.ఏ.ఎస్ కి ఎన్నిక అవడం, ఆంధ్రప్రదేశ్ కేడర్‌కే నియామకం జరగడం, కడపలో ట్రెయినింగు అయిన వెంటనే గూడూరు సబ్ కలెక్టరుగా చేరడం. అక్కడున్న మూడేళ్ల కాలంలో తండ్రిపోవడం, అక్కడున్నపుడే మద్రాసు క్వీన్ మేరీస్ కాలేజీలో పనిచేస్తూ వుండిన లలితతో పరిచయం అవడం, పెళ్లి, ఆ తరవాత పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా వెళ్లడం, అక్కణ్ణించి నాగార్జునసాగర్ ప్రాజెక్టులో జాయింటు కలెక్టర్ గా రావడం, 1968 నుంచి 78 వరకూ హైదరాబాదులో డైరక్టరేట్లు సెక్రటేరియట్‌లలో వివిధ హోదాల్లో పనిచెయ్యడం, చివరికి క్కడికి కలెక్టర్‌గా రావడం- అదంతాను.

అంతా ఇంగ్లీషులోనే, అనర్గళంగా, దర్జా అయిన భాషలో చెప్పేడు.

"నీ ఇంగ్లీషు చాలా 'ఛేస్ట్' గా ఉన్నమాట నిజం. దానికి నీ కింగ్లీషు చెప్పిన మేష్టరుగా నాకు ఆనందంగానే వుంది. కాని, ఇంగ్లీషు అవసరం లేనిచోట తెలుగు మాట్లాడ్డమే నాకిష్టం అని నీకు తెలుసే?" అన్నాను.

"అవసరం ఉంది, మేష్టారూ. ఇక్కడ మనం యిద్దరమే కాక లలిత కూడా ఉంది కదా. ఆవిడ వినకూడనివేవైనా ఉన్నప్పుడే మనం తెలుగులో మాట్లాడుకోవాలని నా ఉద్దేశం. అంతే కాని, హనుమంతుడి ఎదురుగా కుప్పిగంతులన్నట్టు మీ దగ్గిర నా ఇంగ్లీషు పాండిత్యం ప్రదర్శించాలని కాదు."

"చూడండి, మేడమ్ లలితా" అన్నాను" మేం ఎదుగుతూ ఎదుగుతూ వున్న కాలంలో స్వాతంత్ర్య ఉద్యమం వచ్చింది. నా ముప్ఫయ్యో ఏట క్విట్టిండియా మూమెంటొచ్చింది. ఇంగ్లీషు వాళ్లు దిగుమతి చేసి బలాత్కారంగా మనమీద రుద్దిన వస్తువుల్ని బహిష్కరించడం- ఆమాటకొస్తే తగలబెట్టడం- అప్పటి ధర్మ ప్రయుక్తమైన నీతి. నిజానికి ఇంగ్లీషు భాషని ద్వేషించడం కూడా ఒకానొక ధర్మంగానే మేం స్వీకరించేం. బతుకుతెరువుకోసం ఇంగ్లీషు పాఠాలు చెప్పవలసి వస్తే అది ఒకానొక పూర్వకృత పాప ఫలం అనే భావించేం. అయితే, వృత్తి ధర్మం అని ఒకటుంది కదా. ఆ ధర్మానికి కట్టుబడి, చెప్పే ఇంగ్లీషులోనూ రాసే ఇంగ్లీషులోనూ తప్పులు దొర్లకుండా చూసుకున్నాం, అంతే."

"సరిగ్గా చెప్పేరు మేష్టారూ. అందుకే నా ఇంగ్లీషు ఛేస్ట్‌గా ఉండుంటుంది. " అని నవ్వేడు సారంగ. "అందుకే నేను మేడమ్ లలిత దగ్గిర నాపరువు పోకుండా చూసుకోగలుగు తున్నాను. ఆమె మాట్లాడేది గానీ, రాసేది గానీ, ఇంగ్లీషు ఇంకా చక్కగా ఉంటుంది. పైగా, మా సంసార వ్యవహారం అంతా ఇంగ్లీషు మీడియమ్‌లోనే సాగుతోంది కదా!" అని మరింత కులాసాగా నవ్వేడు, సారంగ.

"గొప్పవాడిగా ఎదిగేవు; సంతోషం. ఐతే పాటలు పాడ్డం మానీలేదు గదా?'' అన్నాను.

"అయామ్ సారీ, ఐలాస్ట్ ఎవ్విరి ట్రేస్ ఆఫ్ దట్రాక్ ( ఆ దారే మర్చిపోయాను)'' అన్నాడు.

"నేను సారంగతో ఏకీభవించను!'' అన్నది లలిత.'' సంగీతం అనేది సాంకేతిక విద్య కదా; సైకిల్ తొక్కడం, ఈతకొట్టడం- ఇలాగ. సాధన లుప్తమైతే కావచ్చుగాని దారే మర్చిపోడం అనేది నమ్మదగిన మాటకాదు. 'మీ' సారంగ బాత్‌రూమ్స్‌లో హమ్ చెయ్యడం నాకు వినిపించకపోవచ్చు. ఎందుకంటే మేం ఉండే చోట్లల్లా బాత్‌రూమ్స్ సౌండ్ ప్రూఫ్‌గా ఉంటాయి గనక! కాని, ఒంటరిగా కేంప్స్ వెళ్లేటప్పుడు కారులో వెనక సీట్లో విశ్రాంతిగా వాలి ఉన్నప్పుడు పాడుతూనే ఉన్నారని వింటూనే ఉన్నాను!''

వినడానికి అవకాశం లేకపోవడం, వినకుండా ఉండలేకపోవడం మధ్య భేదనైశిత్యాన్ని అలా సూచించ గలిగినందుకు లలితకు నవ్వు వచ్చినట్టయింది. "అయ్యగారి గాన ప్రావీణ్యాన్ని గురించి నాకు మనవి చేస్తేనే తప్పా తోచదు. కొందరు డ్రయివర్లకి!''అంది.

"నన్ను చెప్పనీ అమ్మా. ఇతను మా కాలేజీలో చదువుకునేటప్పుడు ఇతనే కాలేజ్ మేల్ సింగర్. చిత్రమేమిటంటే, ఓసారి ఓ పత్రికలో లైట్ మ్యూజిక్‌ని గురించి ఒక వ్యాసం అచ్చయింది. దాని రచయిత సారంగదేవ్ అని వుంది. నేనితన్ని పిల్చి; 'సంగీతం పాడుతావు- బాగానే వుంది; సంగీతం గురించి పత్రికల్లో వ్యాసాలు రాయడం దాకా వచ్చేవా' అని కూకలేసేను. దెబ్బలాడ్డం ఎందుకు, మెచ్చుకోనే వచ్చు కదా, అనకు. పదిహేడు-పద్దెనిమిదేళ్ల వయస్సులో ఉంటూ, మణుగుల కొద్దీ సిలబసులు నెత్తిమీద ఉండగా అభ్యాసేతర వ్యాపకాల మీద శ్రద్ధ చూపించి సమయం వృథా చేస్తే అది చదువుమీద ఖచ్చితంగా దెబ్బతీస్తుందని మా తరం ఉపాధ్యాయుల భయం-... సరే, నేనలా అడిగే సరికి ఇతను నెత్తీ నోరూ మొత్తుకుని - అయ్యబాబో, నేనేమిటి; సంగీతం మీద వ్యాసాలు రాయడమేమిటి; నేనే పాపమూ ఎరగనే- అని గోలపెట్టేడు. ఏ స్టూడెంటు ఎలా చెడిపోయి చదువు సన్నగిల్లించుకుంటే మనకేమీ అని వూరుకునే టీచర్లం కాదు. అందుకని ఆ పత్రిక వాళ్లకి ఉత్తరాలు రాస్తే, వారం వారం ఆ వ్యాసాలు రాస్తున్నది బాలాంత్రపు రజనీకాంతరావు గారని తేలింది.

ఫోను గిజ్‌జ్ మంది.

సారంగ చటుకుని ఎడంవేపు వంగి రిసీవర్ తీసేడు, "ఏమిటి, మిస్టర్ సూర్యనారాయణా; ఎవరు? డిడ్జై నాట్ టెల్యు టు కీప్ మి ఫ్రీ?... ఓ; ఐసీ .. ఇవ్వండి... ... నమస్కారం సార్. యస్, సార్. అవునండి, నేను కలెక్టర్ సారంగనే మాట్లాడుతున్నాను సార్... ఊఁ... ఐనో.... యస్, సార్.. ఇంకా నిర్ణయం తీసుకోలేదండి... యస్, సార్... ఆర్.డి.ఓ. రిపోర్టు తమకి అనుకూలంగా లేదని కోనేటి రావు గారు నాకు చెప్పేరు సార్. అందుకని జాయింట్ కలెక్టర్ గార్ని రెవ్యూ చెయ్యమన్నానని గుర్తు... యస్. సార్ అలాగే సార్... పదిరోజుల్లో వస్తుందనుకుంటాను సార్... అంటే, జె.సి.గారు ఒక ఆర్బిట్రేషన్ కేస్‌లో బిజీగా ఉన్నారు సార్. ఆఁ, ఎస్; హైద్రాబాద్ లోనే ఉన్నారు సార్...అలాగే సార్, నమస్కారం...!

రిసీవర్ క్రెడిల్ మీద పెట్టేసిన తరవాత ఒక నిమిషంపాటు కళ్లు మూసుకుని తల పైకిలేపి కూర్చున్నాడు సారంగ. నేను లలితవేపు చూసేను. ఆమె "ఏం ఫర్వాలేదు'' అన్నట్టు ఒక ఆంగికం చేసి మొహం అటు తిప్పుకుంది.

సారంగ కళ్ళు తెరిచి మా ఇద్దరి వేపూ చూసినప్పుడు యోగముద్రలోంచి ప్రాపంచికానికి వచ్చినసిద్ధుడిలా కనిపించేడు. "నేనడిగిందానికి సమాధానం చెప్పనే లేదు, మేష్టారు. " అని నిరామయంగా నవ్వేడు. "అదే; ఇల్లు కూడా కట్టుకోలేదుటా?"

"ఎందుకులే సారంగా; అదంతా ఓ నరకం." అన్నాడు నవ్వి.

"మిమ్మల్ని బాధ పెడ్తే క్షమించండి. కాని, తెలుసుకోవాలనుంటుంది కదా?"

నేను నిట్టూర్చేను "ఇల్లు-కట్టడమైతే కట్టేను గానీ అది నా ఇల్లు అవలేదు." అన్నాను. "సరే -తెలుసుకోవాలనుందంటున్నావు గనక చెప్తాను. అదంతా, ఉమర్ ఖయామ్ చెప్పినట్టు - జీవిత సార్థవాహము విచిత్ర గతిన్ పయనించు - అనొచ్చు. మా అబ్బాయి డిఫెన్స్ ఎకౌంట్స్‌లో పనిచేస్తున్నాడు. వాడు పూణేలో ఉన్నప్పుడు వాడికెవరో హైద్రాబాద్‌లో ఒక స్థలం ఆఫర్ చేసేరు. చవక అనిపించే రేటుకి వస్తోందని డిపార్ట్‌మెంట్ నుంచి అప్పు తీసుకుని కొనేశాడు. కాని, డిపార్ట్‌మెంటు వాళ్లు ఆ అప్పు "స్థలం కొనడానికి" అని కాకుండా "ఇల్లు కట్టడానికి" అని ఇచ్చేరు. మా అబ్బాయికి అప్పట్లో వచ్చే జీతాన్ని పరిగణనలోకి తీసుకుని అప్పట్లో నలభై వేల చిల్లర రుణం కింద గ్రాంట్ చేసేరు. అందులో పద్దెనిమిదివేలు స్థలం కొనడానికైంది. స్థలం కొన్నతేదీనుంచి లెక్కవేసుకుని పద్దెనిమిది నెలలు గడిచేలోపుగా ఇల్లు కట్టాలని నిబంధన ఉందిట. ఈలోగా వాణ్ణి పూణేనుంచి ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ చేసేరు. స్థలం అమ్మేసి డబ్బు కడ్తావా, మిగతాలోన్ తీసుకుని ఇల్లు కడ్తావా అని నోటీసిచ్చేరు. దాంతో కొడుకూ కోడలూ ప్రయాణమైవొచ్చి కడుపూ కాళ్లూ పట్టుకున్నారు. ఇల్లు కట్టాలంటే ఆ మిగతారుణం ఇరవై రెండువేలు కాక ఇంకో అరవై వేలు కావాలి. అంతలాగ పెరిగిపోయాయి, నిర్మాణపు ధరలు. ఏమైనా సరే, ఇల్లు నిలబెట్టాలని పట్టుదలతో అల్లుణ్ణి బతిమాలుకుని అమ్మాయి పేర ఫిక్సెడ్ డిపాజిట్‌గా మేం ఉంచిన యాభైవేలూ వెనక్కితీసేసుకుని అబ్బాయి కిచ్చేం.... మీరు వెళ్లి హైద్రాబాదులో ఉండండి; ఓ వాటా అద్దెకిచ్చేసి రెండో వాటాలో మీరు ఉండొచ్చు- అన్నాడు. ఇక్కడ నాకు రిటైరయిపోయేక ఒక ప్రయివేట్ రెసిడెన్షియల్ కాలేజీలో ఉద్యోగం ఇచ్చేరు కదా. ఇది వదిలేసి హైద్రాబాదు వెళ్లిపోతే గూడు ఉంటుంది గాని కూడు ఉండకపోవచ్చునని వెళ్లలేదు. పైగా అల్లుడికి ఉద్యోగం లేదు. అతనికి ఆ ఫిక్సెడ్ డిపాజిట్ వల్ల వచ్చే నెలవారీ వడ్డీ కూడా పోయింది. వయస్సేమో ముప్ఫయ్యారు దాటింది...."

"మేష్టారూ, మీరు క్విట్టిండియా ఉద్యమంలో జైలుకెళ్లి పదినెలలున్నారనీ, అదనీ ఇదనీ చెప్పుకునేవారు? ఆ లెక్కని మీరు రాజకీయ బాధితులు కదా?"

'అల్లుడు కూడా అదే మాట అన్నాడు. నిజానికి, జైల్లోంచి వచ్చేక నాకు ప్రమోషను వద్దూ. ఎమ్ ఏ బి.ఈడీ స్కేలు కూడా వద్దు- అని రాసిచ్చేకనే నన్ను మళ్లా ఉద్యోగంలోకి తీసుకున్నారు!'

"అంచేత, రాజకీయ బాధితుడుగా ఓ ఐదెకరాల భూమి ఇప్పించమని మీరు దరఖాస్తు చెయ్యవలసింది!"

"చెయ్యకేమీ? అప్పుడు తూర్పుగోదావరి జిల్లాలో ఉండేవాణ్ణి కనక ఆ కలెక్టర్ గారికీ అప్లికేషను పెట్టేను; ఇప్పుడు ఇక్కడున్నాను గాబట్టి ఇక్కడా పెట్టేను. ఎన్క్వయిరీ ఆఫీసర్లందరికీ రుజువులూ సాక్ష్యాలూ జతపర్చి కాగితాలిచ్చేను. కానీ, ఫలితం లేదు; ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే, అలాగ బ్రిటిష్ వారి రాజకీయం వల్ల ఓసారీ, మన ప్రస్తుత రాజకీయాలవల్ల మరోసారీ డబల్ బాధితుణ్ణయ్యేను.. చెప్పేనుగా; అదంతా ఓ నరకం అని?"

సారంగ నవ్వేడు. "మీరు అవతారం మార్చుకుంటే బాగుండేదేమో."

"అంటే?"

"అంటే మరేం లేదు; మీరేమో నేను పొలిటికల్ సఫరర్‌ని - అంటే రాజకీయ బాధితుణ్ణి- అంటున్నారు. అలా కాకుండా మీరు నేను స్వాతంత్ర్య సమరయోధుణ్ణి- అని ప్రకటించుకోవాలి; అప్పుడు పని జరుగుతుందేమో."

"రెండూ ఒకటే కదోయి?"

లలిత కలగజేసుకుంది హటాత్తుగా." రెండూ ఒకటి కావు మేష్టారూ" అంది.

"నాకర్థం కావడం లేదు...." అన్నాను.

"నే చెపుతాను వినండి: బాధితుడు బాధితుడే; యోధుడు యోధుడే. బాధితుడి కంటె యోధుడు గొప్పవాడు. యోధుడు వీర స్వర్గాన్ని అలంకరిస్తే ఏమోగాని మిగిలి పోయాడంటే మాత్రం తన యోధత్వాన్ని గురించి చెప్పుకోకుండా పొగిడించుకోకుండా ఉండలేడు. ఇవాళ అలాంటి యోధులు తెలంగాణా నిండా కొల్లలు కొల్లలు. కనీసం మీసాలైనా తెల్లబడవు; కాని, ఉప్పు సత్యాగ్రహంలోనో క్విట్టిండియా ఉద్యమంలోనో, పోలీస్ ఏక్షన్‌లోనో పోట్లాడాం అంటూ సర్టిఫికేట్లు తెచ్చుకుని ఎన్ని రకాల రాయితీలు పొందొచ్చో అన్నీ పొందుతున్నారు. ముఖ్యంగా ఆసేతు హిమాచలం ప్రయాణాలకి రైళ్లలో ఫస్టుక్లాసు పాస్‌లూ, ఎస్కార్ట్ సదుపాయాలూ, ఎవరికైనా ఢిల్లీలో పన్లుంటే టిక్కెట్ కొనుక్కుని వెళ్లే అవసరంలేదు; ఒక (స్వాతంత్ర్య సమర) యోధుణ్ణి పట్టుకుని అతని సాదర్ల సంగతి చూసుకుంటే చాలు! ఇది క్రమంగా ఎలా పరిణామం చెందిందంటేనూ; ఈ యోధులనేవాళ్లు రాజకీయంగా తమకుండే పలుకుబడిని బల్లెంగా చేసుకుని కొల్లగొడుతున్నారు దేశాన్ని. ఇలాటి యోధులు ఇప్పుడు ఉభయగోదావరిజిల్లాల్లోనూ తయారయ్యారు. మీకు ఢిల్లీలో గాని హైద్రాబాదులోగాని పన్లున్నాయా? నాతోరండి; ఫస్ట్‌క్లాస్‌లో తీసుకుపోతాను; నాకు మీరు సెకండ్‌క్లాస్ ఛార్జీలిచ్చి నా సాదర్లు పెట్టుకోండి, చాలు- అని అమ్మకాలు ముమ్మురంగా చేసుకుంటున్నారు.

"సరే, యోధులసంగతి అది కదా. బాధితుల సంగతికొస్తే - ఓసారి నేనూ సారంగా మద్రాస్ నుంచి కోయంబత్తూరు ద్వారా పాల్ఘాట్ వెళ్లినప్పుడు రైల్లో జరిగిన సంగతి చెప్పవలసిందే. ఓ ఎనభై ఏళ్ల ముసలాయన. వృద్ధాప్యపు పెన్షన్ మంజూరు కోసం మద్రాస్ వెళ్లొస్తున్నాడు. రాజకీయ బాధితుడుగా ఫస్ట్‌క్లాస్ పాస్, ఎస్కార్టు - అన్నీ ఉన్నాయి. ఆయనకూడా ఆయన కుమార్తె; యాభై ఏళ్ల విధవరాలు ఉంది. కాని రైలెక్కిన క్షణంనుంచీ ఆ రైల్వే అధికారులు వాళ్లని ఏం ఏడిపించుకు తిన్నారని! వాళ్లని కారిడార్‌లో నిలబెట్టుంచి బెర్తులన్నీ చకచకా అమ్మేసుకున్నారు, తెలుసా?... అందుకే, సారంగ - మిమ్మల్ని అవతారం మార్చుకోమంటున్నాడు. మీరు బాధితుడిలా మొహం దీనంగా పెట్టి అడక్కండి. యోధుడిలా తలెత్తి దబాయించండి. ఏదయ్యా; నాకు రావలసిన ఐదెకరాల భూమీ ఎప్పుడిస్తావు, ఎక్కడిస్తున్నావు- అంటూ!"

"అలా దబాయించిన వాళ్లకి అడిగినవల్లా యిచ్చేస్తే మళ్లీ మీరు మద్రాసు క్వీన్ మేరీస్ కాలేజీలో లెక్చరరుగా చేరి సారంగని పోషించుకోవలసిందే." అన్నాను, నవ్వి.

"ఓసారి అంతపనీ జరిగింది. కణ్ణన్ అని ఒకాయన గుంటూరు కలెక్టరుగా ఉండే వారు. వాళ్లమామగారు రాజకీయ బాధితుడే. అప్పట్లో సంగడిగుంట, నల్లపాడు, కాకాని లాంటి గుంటూరు

శివార్లలోనూ మంగళగిరి, కాజలాంటి విలువైన భూములున్న వూళ్లలోనూ బంజరు భూములు చాలా వుండేవి. అటుచూసి, ఇటుచూసి, మామగారే కదా అని మంచి స్థలం ఐదెకరాలు వెతికి పట్టుకుని ఆయనపేర పట్టా ఇచ్చేశారు. ఆర్నెల్లు తిరక్కుండా ఆయన ఆ భూమంతట్నీ సైట్లకింద చేసి అమ్మేసుకున్నాడు. ప్రభుత్వం కణ్ణన్ గార్ని డిస్మిస్ ఏం చెయ్యలేదు. గాని ఘాటైన సంజాయిషీ అడిగి ఆయన్నక్కణ్ణించి ట్రాన్స్ఫర్ చేసేరు. అలాగే మీపేర ఇప్పుడు భూమికి పట్టా ఇచ్చేరనుకోండి; మీ అల్లుడు దానిమీద వ్యవసాయం చేస్తాడంటారా?''

"చేస్తాడనుకుంటాను,'' అన్నాను సారంగ కళ్లలోకి నిదానంగా చూస్తూ.

"బ్రాహ్మడి వ్యవసాయం అన్న నుడికారం వుందనుకుంటాను?'' అని అడిగాడు సారంగ.

"అలా తీసి పారెయ్యక్కర్లేదు. కళా వెంకట్రావు గారి పుణ్యమా అని బ్రాహ్మలకి అగ్రహారాలు లేకుండా పోయాయి గాని మా అల్లుడి పూర్వీకులు గరికవలస అగ్రహారంలో నాగలి పట్టిన వాళ్లే. ఇప్పుడు నేను ఐడెంటిఫై చేసిన గవర్నమెంటు బంజరు ఈ నగరానికి పట్టుమని పది కిలోమీటర్లు దూరం లేదు. అక్కడ కూరగాయలు దివ్యంగా పండుతాయి. ఒక మినీ వ్యాన్ ఉంటే ఆ పక్కవాళ్లవీ ఈ పక్కవాళ్లవీ కూడా టవునుకి చేర్చి తను ఇంత తిని మరోళ్లకి ఇంత పెట్టే నిబ్బరం నిండుగుండే ఉన్నకుర్రాడే. పరిస్థితి కొంచెం అనుకూలిస్తే అక్కడే ఓ తాటాకిల్లు కట్టుకుని కాపరం అక్కడికి మార్చేసుకుని పోతే ఈ రెసిడెన్షియల్ కాలేజీలో కంఠశోషకూడా తప్పుతుంది నాకు.''

'అంత ఖచ్చితంగా ఎవర్నీ నమ్మెయ్యకూడదనుకుంటాను, మేష్టారూ, 'అన్నాడు సారంగ. "మీ పేర భూమి గ్రాంట్ చేసేరే అనుకోండి; మీ అల్లుడు మిమ్మల్నీ మీ అమ్మాయినీ పీడించి తనపేర ఓ పవరాఫ్ ఎటార్నీ రాయించుకుని ఆ భూమంతా ఇళ్లస్థలాలు చేసి అమ్మేయొచ్చు. మీరే అన్నారు కదా, ఆ భూమి సిటీకి పట్టుమని పదికిలో మీటర్లు లేదని!''

"అలాటి ద్రోహానికి వాడు సిద్ధమైనా నేను కాను కదా. నా స్వభావం-''

"మేష్టారూ, ఇప్పుడు స్వభావాలు కాదు, పన్లు చేసేది. ప్రతాపాలు! ఇంకా మాట్లాడితే పరాక్రమాలు! ఇందాక ఫోన్ చేసింది ఎవరనుకున్నారు? సాక్షాత్తు రెవెన్యూ మినిష్టరుగారు! కోనేటి రావనే ఆయన వారి దగ్గిర బంధువు. ఆయనకూడా సరిగ్గా మీరు ఐడెంటిఫై చేసిన గవర్నమెంట్ బంజర్ భూమినే ఎంచుకుని మొదట మంత్రిగారి సాయంతో స్వాతంత్ర్య సమరయోధుడనని సర్టిఫికేటు తెచ్చుకుని ఇప్పుడు వీరుడై పరాక్రమంతో దురాక్రమణకి తలపెట్టేడు. మంత్రిగారు స్వయంగా కథ నడిపిస్తున్నారు. రెవెన్యూ ఇనస్పెక్టరూ, తాసిల్దారూ వాళ్లకి అనుకూలంగా రిపోర్టులు రాసేరు. "ఎవరూ తక్కువ తిన్లేదు'' అంటారే, దానికి స్వభావసిద్ధమైన అర్థంలో పనిచేసేరు. ఇప్పుడు మినిస్టర్ గారు ఏ దారికి వచ్చేరో తెలుసా, మేష్టారూ? పట్టా గ్రాంటయిన నెలరోజుల్లో లే ఔటు వేసి, నగరాభివృద్ధి సంస్థనుంచి ఆమోదం "తీసేసుకుంటారు''ట. ఆమరుసటి నెలలోనే సైట్లన్నీ అమ్మకం అయి పోతాయట; పార్టీలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారట. అన్ని విషయాలూ ఆలోచించి ఆర్డర్ వేస్తే మావాడు మీ పేరు చెప్పుకుని బతుకుతాడు అంటూ మినిస్టర్ గారు స్పష్టంగా చెప్పేరు. ఈ ఆర్డర్ వెయ్యకుండా నేనిక్కడికొచ్చిన ఈ నలభై రోజుల నుంచీ జరుపుకొస్తున్నాను. మినిస్టర్ గారు రోజు విడిచి రోజు ఫోన్ చేస్తున్నారు. కోనేటి రావు గారైతే మేడమ్ లలితకి ఓపెన్ ఆఫర్ ఇచ్చేశారు. తమరు ఎంచుకున్న రెండు సైట్లు "శ్రేష్ఠమైనవి''; "నామమాత్రపు ధరకి'' క్రయం చేస్తారట!''

"కానీ, ఎవరికేది ప్రాప్తమో! మీకు ఈవూళ్లో రెండు స్థలాలుంటే నాకు మాత్రం ఆనందం కాదా యేమిటి?"అన్నాను.

సారంగ తన ఎడంవేపుకి వంగి టెలిఫోన్ మీద ఉన్న ఒక బటన్ నొక్కేడు. "సూర్నారాయణ గారూ; మీరు వెళిపోవచ్చు... ... ... ఇందాక బంగ్లాకొచ్చిన ఫైల్సులో మూడు లాండ్ ఎసైన్‌మెంట్ ఫైల్సున్నాయి. అవి ఇక్కడికి పంపండి, "అన్నాడు. రిసీవర్ పెట్టేసి చిరునవ్వుతో అన్నాడు; "ఆ మూడు ఫైల్సులో ఒకటి- కోనేటి రావు వెర్సస్ గౌతమశాస్త్రి; మేష్టారూ!"

"అంటే, నా కాగితం బుట్ట దాఖలా అయిపోలేదన్నమాటా?"

"నాటెటాల్. మేష్టారూ; నెలరోజులకిందట నేను మీ ఇంటికొక డిప్యూటీ తాసిల్దార్ని పంపేను; మీ యోగక్షేమం కనుక్కుని రమ్మని, సరే- అతనేదో చెప్పేడనుకోండి- పదిహేను రోజుల కిందట నా డఫేదార్ మీ ప్రస్తుతపు అడ్రస్ తెచ్చి నాకిచ్చేడు. అందువల్ల మిమ్మల్ని ఇక్కడికి రప్పించుకో గలిగేను. మీ అంతట మీరు రారని నాకు తెలిసింది. కనకనే మిమ్మల్ని ఇక్కడికి రప్పించాను. ఎంతో ఆహ్లాదకరమూ, సంపూర్ణంగా వ్యక్తిగతమూ అయిన వాతావరణం ఏర్పరచినా కూడా, నాయనా సారంగా, నేను ఫలానా అప్లికేషను పెట్టాను; నా పాలిటి అదృష్ట దేవతలాగా నువ్విక్కడికి కలెక్టర్‌గా ఒచ్చావు; నా అప్లికేషను పైకి తీయించి ఒక్క కలం పోటు పొడిస్తే నీ పేరు చెప్పుకుని శాంతంగా జీవిస్తాను - అని మీరు నోరు విడిచి ఒక్కమాట అడగలేదు. మన ఇంగ్లీషు పాఠాలు, నా సంగీతాభిరుచి ఇల్లాంటి వాటి మీదనే మాట్లాడేరు. ఈ వ్యవస్థలో మీలాంటి వాళ్లు నిష్ప్రయోజకులు. అయితే నేను మాత్రం నిష్ప్రయోజకుడిగా ఉండదల్చుకోలేదు."

దఫేదారు ఫైల్సు పట్టుకొచ్చేడు.

సారంగ తనకి కావలసిన ఫైలు ఏరి, దాన్ని ఆమూడింట్లో అడుగున పెట్టి ఫైలు కట్టేసి టిపాయిమీద పెట్టుకున్నాడు.

*

*('సుప్రభాతం' పక్షపత్రిక : మార్చి 1997)*